
కథ




# ఊరెళ్ళిపోతుంది

—— బండపాటి నరసింహస్వామి

సింధూరపు పంట తూరుపు ఇంట కళ్ళాపు చల్లిన వాకిళ్ళు, రమణీయమైన రంగు ముగ్గులు పల్లెతల్లి ఒడిలో వాలి పరవశించిన రోజులన్నీ జ్ఞాపకాలు కావడమే తనకు ఇష్టం లేదు.

పిచ్చుకల రవరవలు, గువ్వల గూ... గూలు పిల్లల అల్లరి ఆటలు, పల్లెను పరుచుకున్న పచ్చని పొలాల మధ్య నాజూకుగా సాగిపోయే పిల్ల కాలువల స్వరవిన్యాసాలు రేపటి నుంచి జ్ఞాపకాలు కాబోతున్నాయి.

చదువు సంధ్యల ఒడిలో అమ్మవొడిని వీడి ఆట పాటలతో గడిపిన రోజులు, సంతలో వింత వస్తువులు వీధుల నిండా పండిన రోజు పావలా పైసలతో ప్రపంచం కొనవచ్చనే చిన్న పెత్తాందారీతనం, ఇవన్నీ గడిచిపోయిన రోజులే. శ్రీనివాసమూర్తికి బదిలీ బండరాయిలా ముందర వాలింది

'ఉద్యోగం అన్నాక బదిలీ తప్పదు ఆ మాత్రం దానికే ఇంత ఇదా?' భార్య సునంద చురక.

'సర్దుకు పోవాలి నాయనా కాలచక్రం మనకొరకు ఆగదు. సాగుతూనే ఉంటుంది' తండ్రి సుందర రామయ్య ఉవాచ!

తెల్లవారకుంటే బాగుండు... కానీ తెల్లవారకుంటే జీవితాంతం రాత్రి ఉంటే ఏం బాగుంటుంది? శ్రీనివాసమూర్తి మనసు పరిపరివిధాల పరిభ్రమణం.

ఆలోచనలు కట్టిపెట్టి సామాను సర్దడంలో నిమగ్నమయ్యాడు శ్రీనివాసమూర్తి.

చేతులు పని చేస్తున్నా. కాళ్ళు పని చేస్తున్నాయి. మనస్సు మాహో ఇదిగా ఉంది. ఛ... బదిలీ అయినంత మాత్రానా మనవూరు రానా ఏమిటి? వెదవ ఆలోచనలు... తనను తానే విసుక్కున్నాడు.

★ ★ ★

పూరిళ్ళు...

తాతల నాటి జ్ఞాపకం, సగభాగం నేలమట్టం కాగా సగభాగం జమా ఖర్చు ఎంచకుండా సరిచేస్తుంటే శతాబ్దం దాటినా నీడనిస్తూ తోడై నిలిచింది ఇల్లు.

అమ్మ లేదు... ఇంట్లో నాన్నగారు ఒక్కరే, రిటైర్డ్ టీచర్. కాలక్షేపానికి మా ఇద్దరు పిల్లలే నాన్నగారి అభిరుచులు పిల్లలతో పిల్లాడై పోవడమే! ఈ బదిలీ నాన్నగారికి బాధగానే ఉంది. అయినా బయటపడే తత్వం కాదు. తనకు అనుభవమైనదే కదా ఉద్యోగ జీవితం.

తాతయ్యా నువ్వు మాతో రావాలి. పిల్లలు నిన్నటి నుండి ఒకటే గోల... చిరునవ్వు సమాధానం, వస్తానని కాదు రానని చెప్పలేని తనం.

ఉండబట్టలేక నేను అడిగాను. నాన్నగారు మీరు కూడా మాతో రారాదు ఈ వయసులో వంటరిగా ఈ పల్లెటూళ్ళో ఎలా ఉండగలరు?

నిశ్శబ్దం గది నిండా నిండిపోయింది. కొన్ని క్షణాల అనంతరం పొలం... ఇల్లు ఉన్నాయి. ఈ పల్లె అయితే పుట్టి పెరిగింది. నగరంలో నాకు కాలక్షేపం కాదు. జీవితానికి ఉద్యోగపు రిటైర్మెంట్ అంటే... పుట్టి పెరిగిన ఊరిలో పునర్జీవనం పొందడమే! జీవితం విశాలం కొంత భాగం ఇచ్చువచ్చిన తీరున జీవించే అవకాశం అయినా ఆ నగరపు నాగరికత నాకు సరిపడదు. అర్ధరాత్రి అయినా రణగొణ ధ్వనులు. ఇల్లే నరకం ఇల్లే స్వర్గం నాగరికత నెట్‌వర్క్ మీద నాణ్యత ఆ ప్రపంచంలోకి నన్ను లాగకు సెలవులు దొరికినపుడు మీరే ఈ పల్లెకు వచ్చి గడపొచ్చు. నా జీవితం ఇలాగే గడపనీయరా మూర్తి' నిట్టూర్చాడు సుందర రామయ్య.

తండ్రితో మాట్లాడుతూనే సామాన్లు సర్దడం పూర్తి చేశాడు. తెల్లవారితే లారీ ఇంటి ముందు నిలుస్తుంది.

ఊరి చాయలనుండి నగరపు జన సాగరంలోకి జారిపోవడమే... శ్రీనివాసమూర్తి ఆకాశం వైపు చూశాడు. పున్నమి వెన్నెల పులకరించి పోతుంది. పండిన వెండి వెన్నెల ముందు నక్షత్రాలు నానా నరకయాతన పడుతున్నాయి.

వెండి పండిన ఆకాశం తెల్లటి దుప్పటి నేల. చల్లని చిరుగాలికి వసంతపు సంతోషంతో తూగుతున్న మొక్కలు, ఊరికి దూరంగా పారుతున్న సెలయేరు గలగలలు. వర్షాకాలం ఊరి వాకిళ్ళముందు ప్రత్యక్షమై భయంగొలిపే సెలయేరు, అలజడి ఎరుగని అనామకురాలిగా నదిలోకి మెల్లమెల్లగా జారిపోతోంది.

అందరూ పడుకున్నారు కానీ... ఎంత ప్రయత్నించినా కళ్ళు మూతలు పడడం లేదు.

నాకు జన్మనిచ్చి జీవితాన్నిచ్చిన ఊరు, రేపు తానులేని ఒంటరిదై పోతోంది. ఛ... ఊరు వెళిత కావడమేమిటి? మనసు ఎదురు ప్రశ్న.

కాలం వెన్నముద్దలా కరిగిపోతుంది. పల్లెటూరిలో అదే నగరంలో కాలం ఖనిజ లవణాల్లా అరిగిపోతుంది. యాంత్రికత మీద జీవితం మరల అరల్లో మార్మికత, సహజ సౌందర్య అనుసందానమైన ఆనందం నగరంలో ఏ మూలా వెతికినా కనరాదు. అయినా జనానికి నగరం మీద మోజు రోజు రోజుకి పెరుగుతున్న మోజు.

గడియారం ముళ్ళు పరస్పరం కౌగిలించుకుని పరద్యానంగా అర్ధరాత్రిని మరిచినాయి జ్ఞాపకాలు.

జడివానలో కాగితపు పడవలు వదిలిన జ్ఞాపకాలు. తలతడిసి జలుబు చేసినపుడు అమ్మ మందలింపు, ఆ తరువాత అమ్మ ఒడిలో బుజ్జగింపు, ఆ వెచ్చని గోరుముద్దల స్పర్శలు అవన్నీ మాయమై మళ్ళీరాని క్షణాలు జ్ఞాపకమై మిగిలిన తీపి గుర్తులు. అమ్మలేదు, తిరిగి రాదు, తిరిగి వచ్చినా ఆ జ్ఞాపకాలు పసిదనపు తీయదనం వాస్తవంలో ఉండదు.

రేగుపళ్ళకై పొలాలెమ్మట తిరిగి తిరిగి అలసిపోయి చెట్టు క్రింద నిలుచున్నప్పుడు, స్నేహిత చతురుడెవడో రాయి విసిరినపుడు, తలకు గాయం రక్తం జాలువారినపుడు అమ్మ తలకు సున్నం రాయడం, మంట భరించలేక విలవిలలాడినపుడు అమ్మ విఠాయి ఇచ్చి ఏడ్పు మాన్పించినపుడు ఆ తీయని స్పర్శలో బాల్యం ఐస్‌ఫ్రూట్‌లా కరిగిపోయింది.

మా ఊరు మతసామరస్యపు సాముహిక మందిరం. మానవత్వపు మనుష్యులు జీవించే మాహో సౌదం. ఒక వైపు మసీదు, ఒకవైపు చర్చి, మరోవైపు మందిరం రంజాన్ బక్రీద్ పండుగలు అందరికీ సందడి. గుడ్‌ఫ్రైడే, క్రిస్టమస్ అందరికీ ఆనందపు క్షణాలే. దసరా, దీపావళి, శ్రీరామనవమి అందరి పండుగలే. మతం మావూరికి అభిమతమే అందరి మతపు మానవత్వమే మావూరు గొప్పదనం.

ఏ గొడవలు అంటని నగర నాగరికతకు దూరమైన ఆత్మసౌందర్యం కల గొప్పకళ మావూరు. వీధులు పరస్పర కరచలనాల స్పర్శతో ప్రేమ, దయ ఆశిస్సులతో విలసిల్లిన తరతరాల చరిత మావూరి ఘనత.

అందుకే ఈ వూరు అంత గొప్ప.

ఐదు గంటలు గడియారం అలజడి రేపింది. రామాలయంలో వెంకటేశ్వర సుప్రభాతం. చర్చిలో గంటలు మ్రోగుతున్నాయి.

మసీదులో నమాజు వినిపిస్తుంది.

తెల్లవారకుంటే బాగుండు కాలం అరచేతితో ఆపే వారిమి కాము కదా!

తెల్లవారింది!

లారీ వచ్చి ఇంటి ముందు ఆగింది.

నిన్నటి వరకూ ఎంతో ఆనందంగా ఉన్న నాన్న, ఏదో కనిపించని బాధ కనిపించకుండా ఉంచాలనే ఎంతో ప్రయత్నం ఆ ప్రయత్నం అప్రయత్నంగా తెలిసిపోతుంది.

ఉన్న ఒక్కగానొక్క కొడుకు ఊరు వదలి పోతున్నందుకు ఆయన బాధ అలవికానిదే.

పిల్లలు సంతోషంగా ఉన్నారు. నగర వాతావరణం కొత్త ఊహలను రేకెత్తిస్తుంది. కొద్ది రోజులుగా సునంద, పిల్లలకు నగర వాతావరణం కథలు కథలుగా చెప్పడమే కారణం. ఏ క్షణంలో నగరంలో వాలుదామా అని తలపోస్తున్నారు.

శ్రీనివాసమూర్తి లారిలోనే ప్రయాణం. సామాన్లు లారీలో అప్పటికే ఎక్కించారు కూలీలు.

సునంద, పిల్లలను నాన్నగారు తోడుగా వచ్చి నగరంలో దింపి వెళతానన్నారు.

లారీ కదిలింది. జ్ఞాపకాలు శ్రీనివాసమూర్తి మనసు చుట్టూ ముసురుకుంటూ అల్లుకుంటున్నాయి. తన ఊరు పచ్చపచ్చగా పరుచుకున్న పంట పొలాలను దాటుకుంటు పిల్ల కాలువ ప్రక్క నుండి వెళుతుంది లారీ.

ఊరు నుండి తనే వెళ్ళిపోతున్నాడా? కాదు వెళ్ళిపోవడం లేదు ఊరెళ్ళిపోతోంది. కనపడకుండా. నగరపు నాగరికత నుండి, కక్షల కార్పణ్యాల ముసుగు మనుష్యుల నుండి, వెండి వెన్నెల కాంతిలో పచ్చని పొలాలు కొత్త వన్నెను చిందించడం ఉదయపు సూర్య బాలకిరణాలకు మంచు ముత్యాల చిగురుటాకుల నుండి ఒక్కటొక్కటిగా రాలిపోవడం నగరంలో కనిపించని అపూర్వ దృశ్యం! మరో ప్రపంచంలోకి పరుగులు తీస్తున్న మానవత్వంలోకి జారిపోతూ, జాగిలపడి మురికి వాడల చుట్టు ముసిరిన ఈగల దోమల రొంపిలోకి, రంపపు కోతల నాణ్యతలోకి జారిపోతుంది జీవితం కొత్త నీడను వెతుక్కుంటూ.

ఊరెళ్ళి పోతుంది. జ్ఞాపకాల్లోకి నిన్నటి నా పల్లెతల్లి నవ వధువులా, పల్లె పడుచుల మట్టెల పట్టాల శబ్దంలో కొత్త మొత్తయిదువ అయి. కొండల కొనల సెలయేరు జాలు వారే తీరులో నవ్వుతూ మానవత్వపు కడుపు నింపుకున్న ఆ తల్లి గుండెల నుండి వీడిన బాధ క్షణక్షణం హృదయం తరాలలో పేరుకుపోతోంది.

రైల్వే క్రాసింగ్ వద్ద లారీ ఆగడంతో ఆలోచనల్లోంచి శ్రీనివాసమూర్తి మెళుకువ వచ్చింది.

జనరణ్యపు వెగంలో క్షణం తీరికలేని వాహనాల్లో తిరుగుతున్న జనం. పరుగులు తీస్తున్న మానవ గడియారాలు, ముళ్ళు కలుసుకునే అవకాశం లేని కాల భ్రమణంలో పరిభ్రమిస్తు, పరిశ్రమిస్తూ నగరపు నా సోదరులు కాలుష్యపు వాతావరణంలో ఇరుక్కుపోయి, సిమెంట్ వనంలో ప్రాణాలతో కృత్రిమంగా తిరుగాడుతూ, కంప్యూటర్ మీటమీద మెట్లెక్కుతూనే...

ఆలోచన ఆపేయాలి. తన జీవితం ఈ రోజు నుంచి ప్రారంభం. ఊరు తను వీడిరాలేదు ఊరెళ్ళి పోతుంది. ఊరెళ్ళి పోయింది. సెలవుల సెలవుల దాకా... ●